




*తెలుగు జానపద గీతాలకి, జనపద సంగీతానికి కొత్త ప్రాణం పోసిన విదుషీమణి 'కళాప్రపూర్ణ' శ్రీమతి అవసరాల(వింజమూరి)అనసూయాదేవిగారి గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. 92 సంవత్సరాల వయసులో ఆమె వ్రాసిన వ్యాస పరంపర ఇది. అనసూయదేవిగారి సుదీర్ఘ జీవనప్రయాణంలో ఆమె కలుసుకున్న ప్రముఖ వ్యక్తులతో తన పరిచయాల గురించి ఈ శీర్షికలో వివరిస్తున్నారు.*

***రాయప్రోలు సుబ్బారావుగారు***

వీరు నాన్నగారి స్నేహితులు. నా చిన్నప్పుడు వీరు రాజమండ్రిలో కొన్నాళ్ళున్నారు. మా కాలేజి సాంస్కృతిక వారోత్సవాల్లో వీరొక రోజు ముఖ్య అతిథిగా వచ్చారు. ఆ రోజు ఆయన పాటలు రెండు నేను ట్యూన్ చేసి పాడాను. ఒకటి 'చెలియల సిగలలో చెలువారు పూవ', రెండోపాట 'శ్రీలు పొంగిన జీవగడ్డయి పాలుబారిన భాగ్య సీమయి'. మేము మద్రాసుకు వెళ్ళాక ఆయన ఎప్పుడొచ్చినా మా ఇంట్లోనే దిగేవారు. ఎన్నో సార్లు వీరి పాటలూ, పద్యలూ - మద్రాసు రేడియోలోను, సభల్లోనూ పాడాను.

●●●

***బసవరాజు అప్పారావు గారు***

వీరి పాటలు బందా కనకలింగేశ్వరరావుగారెక్కువగా పాడుతూండేవారు. 'మాలపిల్ల' సినిమాలో కూడా కొన్ని పాటలుపయోగించారు. నేను కూడా ఒకే ఒక పాట తీసుకున్నాను. ఆ పాట నాకెంతో కీర్తిని ప్రసాదించింది. అదో కథ.

1935లో నా సంగీతం గురువుగారు 'సంగీత సామ్రాట్' మునుగంటి వెంకట్రావుగారు ఓ రోజు నాకో టెస్ట్ పెట్టారు. 'నువ్వు పాటలకు ట్యూన్స్ బాగా పెడతావని అందరూ అంటారు. ఏదీ నా ఎదురుగుండా ఏదైనా ఒక పాటకు ట్యూన్ పెట్టు, నీకు అరగంట టైం ఇస్తున్నాను. పాటకు స్వరస్థానాలవి శుద్ధ దైవతం, శుద్ధ నిషాదం' అన్నారు. అప్పటికే మామయ్య పాటలన్నింటికీ ట్యూన్స్ పెట్టేయటం వల్ల పాట దొరకలేదు. అన్నీ కోమల స్వరాలవడం వల్ల విచారమో, విన్నవించుకోడమో, భక్తిరసమో కావాలి. బసవరాజు వారి పుస్తకం తిరగేశాను. 'యశోధరవిలాపం' కనపడింది. పదినిమిషాల్లోనే ట్యూన్ పెట్టి వినిపించాను.

పది సంవత్సరాల తర్వాత, నా గురువుగారు మద్రాసులో మా ఇంటికి వచ్చిన రోజుల్లో సంగీత విద్వత్సభలో ఈ పాటను గురించి ప్రశంసించారట. తక్షణం పరూరు సుందరయ్యర్, వారి కుమారులు అనంతకృష్ణ, గోపాలకృష్ణలు మరిద్దరు స్నేహితులతో రత్నపాప పుట్టిన ఇల్లు మద్రాసులోని నెం.3, క్రెసెంట్ పార్క్ స్ట్రీట్‌కు వచ్చారు ఆ పాట వినడం కోసం. అప్పుడు తెలుసుకున్నాను - ఆ రాగం కన కాంగి అనీ, 72 మేళకర్తల్లో మొదటి మేళకర్త రాగమనీ. 65 సంవత్సరాల క్రిందటి పాట 90 ఏళ్ళ దాన్ని నేను పాడి వినిపిస్తే ఎంతో మెచ్చుకున్నారు ఇటీవల నన్ను చూడటానికి వచ్చిన నా అభిమాన గాయకులు మల్లాది సోదరులు.

●●●

## విశ్వనాథ సత్యనారాయణగారు

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ మామయ్యగారు. 'వేయిపడగలు', 'ఏకవీర' రచించిన ప్రఖ్యాత రచయిత. ఎన్నో మహాకావ్యాలు రాసిన గొప్పకవి. వీరి 'కిన్నెరసాని' పాటలు తెలియని ఆంధ్రులు లేరు. ఈ పాటలు ఎందరో పాడారు, నేనూ పాడాను. విశ్వనాథ మామయ్యగారు పాడిన స్టైల్ ఎవరికీ రాలేదు. అలాగే పద్యం చదివే విధానం కూడా చాలా బాగుండేది.

విశ్వనాథ సత్యనారాయణ మామయ్యగారి పాటలకు ట్యూన్స్ పెట్టడం చాలా కష్టం. వారి క్లిష్టమైన సమాసాల్ని తెగ్గొట్టి భావం పోకుండా పాడడం సులభం కాదు. వారు రాసిన సంగీత రూపకం 'సుమిత్రకథ'కు నేను సంగీతం కూర్చాను. విజయవాడ ఆకాశవాణి కేంద్రం నుంచి ప్రసారమైంది.

విశ్వనాథ సత్యనారయణ మామయ్యగారి కుటుంబం అచ్యుతదేవ రాయలు, కృష్ణదేవరాయలు, స్వాహాదేవి నా చిన్ననాటి స్నేహితులు.

●●●

## అడవి బాపిరాజుగారు

కవి, శిల్పి, రచయిత. ఈయన్ని 'బాపి మామయ్యగారూ' అని పిలిచేదాన్ని 1930 నుంచీ నవ్య సాహిత్య సభలకు మామయ్య నన్ను తీసుకువెళ్ళేవాడు, పాడించేవాడు కూడా. ఆ సభలకు బాపి మామయ్యగారు మొదలైన కవులు తప్పక వచ్చేవారు.

బాపి మామయ్యగారు చాలా సరదామనిషి. ఎప్పుడూ అభినయిస్తూ ఆడుతూ పాడుతూ కబుర్లు చెప్పేవారు. వీరు రాసిన పాట 'ఉప్పొంగి పోయింది గోదావరి'కి ట్యూన్ పెట్టి 75 ఏళ్ళు దాటింది. ఆ పాట వన్ ఆఫ్ మై ఎర్లీయస్ట్ కంపోజిషన్‌లోనిది.

నాకు నొక్కు నొక్కులతో, ఒత్తైన పొడుగాటి జుట్టుండేది. చిక్కు తీసుకోవడం అంటే అరగంటపైన పని. మా నాన్నగారు కుంచి సంరక్షణ అని పేరు పెట్టారు. ఒకరోజు నేను చిక్కు తీసుకుంటున్నాను. బాపి మమయ్య నన్ను పిలిచి 'కోడలా జాగ్రత్త. ఒక్క తల వెంట్రుక కూడా కింద పడనీయకు సుమీ. కొంపమునుగుతుంది. క్రిందపడ్డ తల వెంట్రుక అలా అలా, గాలికి ఎగిరెగిరి వెళ్ళి ఏ సముద్రంలోనో పడుతుంది. దాన్ని ఓ చేప మింగుతుంది. సరిగ్గా ఆ చేపకూరే ఒక మహారాజుగారు తింటున్నపుడు అందులో నొక్కు నొక్కులతో ఉన్న పొడుగాటి తల వెంట్రుక కనపడుతుంది. మహారాజుకి కోపం రాదు సరిగదా! ఈ అందమైన శిరోజాలు గల అమ్మాయిని ముల్లోకాలూ గాలించేనా తెచ్చి నాకు వివాహం చేయాలని ఒక్క తల వెంట్రుకా పారేయకుండా దాచు' అన్నారు. చిన్నతనం వల్ల భయపడి, నిజంగా దాచడం మొదలు పెట్టాను. 90 ఏళ్ళ అలవాటు, ఇప్పటికీ మానలేదు. అచ్చు నా జుట్టులాగా ఉండాలని నా చెల్లెలు సీత రెండు సవరాలు చేయించుకుంది. రత్న పాప డాన్సు కోసం రెండు మూడు సవరాలు కట్టించింది. ఎందరో స్నేహితులూ, అభిమానులూ నా జుట్టుని చిన్న చిన్న కుషన్లులో పెట్టి తీసుకెళ్ళారు నా జ్ఞాపకార్థం.

నా జీవితంలో అతి ముఖ్యమైన పాట కచేరీలలో బందరు నేషనల్ కాలేజీలో జరిగినదొకటి. నవ్య సాహిత్య పరిషత్‌కు వచ్చిన కవులేకాక, పట్టాభి సీతారామయ్యగారు, మట్నూరి కృష్ణరావుగారూ కూడా వచ్చారు. విశ్వనాథ సత్యనారాయణగారు, శివశంకర శాస్త్రిగారు, అబ్బూరి రామకృష్ణారావుగారు రాయప్రోలు సుబ్బారావుగారు, కాటూరి వెంకటేశ్వరరావుగారు, వేదుల లక్ష్మీ నారాయణ శాస్త్రిగారు, మల్లవరపు విశ్వేశ్వరరావుగారు, అడివి బాపిరాజుగారు, వింజమూరి శివరామారావు, పిలకా గణపతి శాస్త్రిగారు, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, వింజమూరి లక్ష్మీ నరసింహారావుగారు వచ్చారు. ఇంకా కొందరి పేర్లు మరచాను. ఇంతమంది కవులు రావడం అదే మొదటిసారి.

పాడడానికి వెడుతూ ఆటోగ్రాఫ్ పుస్తకం బాపి మామయ్యగారి కిచ్చాను. 'మీరు రాయడమే కాకుండా, అందరి కవుల చేతా రాయించండని' చెపుతూ పాట పూర్తిచేసి వచ్చి ఆటోగ్రాఫ్ పుస్తకం తీసుకున్నాను. పుస్తకమంతా బొమ్మలే. మామయ్య పాట

ఒక్కొక్కదానికి ఒక బొమ్మ గీశారు. ఎంత అందమైన బొమ్మలో. నా జన్మ తరించింది. ఆ అపురూప కలెక్షన్‌లో నుంచి ఎన్నో, ఎందరో తీసేసుకున్నారు. నా అదృష్టం కొద్దీ బాపి మామయ్యగారివని చెప్పుకోడానికి కొన్ని మిగిలాయి.

1940 వరకూ దాదాపు సోలోస్ పాడేదాన్ని. తర్వాత నా చెల్లెలు సీతని కలుపుకున్నాను. అప్పుడు బాపి మామయ్య మా మీద రాసిన 'నువ్వూ నేనూ కలసి పువ్వులో తావిలా' పాట చాలా పాపులరే అయింది. తర్వాత రికార్డు ఇచ్చాం. బాపి మామయ్య ఆర్ట్ డైరెక్టర్‌గా చేసిన 'మీరాబాయి' చిత్రంలో మీరాబాయి నా చేత వేయించాలని చూశారు. నేను వేయలేదు.

●●●

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

**Click here to share your comments on this article.**